సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 7 । జనవరి । 2024



సోమశిలలో 32.587 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 32.587 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 25 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.64,670
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,808
3 శాతం జీఎస్టీతో..	రూ.5,982
నవర (8 గ్రా)	రూ.47,856

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /24.0

శనివారం గాలిలో తేమ 52 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరుకోలేదు. ఆది వారం మార్పులేవీ ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.





ముత్తుకూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహిని, మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వేదికపై మంత్రి కాకాణి, వైఎస్సార్‌సీపీ నేత కల్పలత, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మేయర్ స్రవంతి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఖాదర్‌బాషా

జగనన్న పాలనకు జేజేలు

సర్వేపల్లి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం

- జనసంద్రమైన ముత్తుకూరు జంక్షన్
- రెపరెపలాడిన వైఎస్సార్‌సీపీ జెండాలు
- హోరెత్తిన జగన్నినాదాలు
- ఉత్సాహంగా సాగిన ర్యాలీ
- హాజరైన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీలు, మంత్రులు



రాష్ట్ర ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు జైకొట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ప్రగతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుతూ జగన్నినాదాలతో హోరెత్తించారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజాప్రతినిధులు వివరిస్తున్న సమయంలో ఈలలు వేస్తూ మద్దతు పలికారు. సర్వేపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు నీరాజనాలు పలికారు.



అభిమాన తరంగమై నినదిస్తున్న కార్యకర్త

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు జేజేలు పలికారు. ముత్తుకూరు జంక్షన్‌లో సామాజిక సాధికార సభకు భారీగా హాజరైన ప్రజలతో సభా ప్రాంగణం జనసంద్రంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ బస్సు యాత్రకు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ప్రజలు హాజరై విజయవంతం చేశారు. ఈ బస్సు యాత్రలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఖాదర్‌బాషా, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి హాజరై మాట్లాడారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

ముత్తుకూరులోని పాత వాణి థియేటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, నేతలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా పాల్గొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు జేజేలు పలికారు. ఈ యాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. మేళతాళాలు, గిరిజనుల నృత్యాలు, కేరళ డ్రమ్స్‌తో జరిగిన ర్యాలీలో ఉత్సాహం ఉరకలెత్తింది. ర్యాలీ జరుగుతున్న సమయంలో దారి పొడవునా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు బస్సు యాత్రకు వచ్చిన ప్రజాప్రతినిధులకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు.

నినాదాల హోరు

ముత్తుకూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, లబ్ధిపొందిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు భారీగా పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. సభలో ప్రజాప్రతినిధులు ప్రసంగాలు చేసే సమయంలో ఈలలు వేస్తూ, జై జగన్.. జైజై జగన్ అంటూ నినదించారు. రాష్ట్రంలో, జిల్లాలో, సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన మేలు, చేకూరిన లబ్ధిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వివరిస్తున్న సమయంలో ప్రజాభిమానం ఉప్పొంగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, నాయకులు ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, నడవడి ముత్యంగౌడ్, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రజాప్రతినిధులు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ..





ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు, సామాజిక సాధికార యాత్రలో నేతలకు హారతులిచ్చేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు

వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణిగా మధుమతి



డాక్టర్ మధుమతి తదితరులను అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నూతన పరీక్షల నిర్వహణాధికారిణిగా డాక్టర్ ఆర్.మధుమతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెతోపాటు అదనపు పరీక్షల నిర్వహణాధికారులుగా డాక్టర్ కె.వి.ఎల్.శ్రీకన్యరావు, ఎ.శివశంకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. వీరికి వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కోలాహలంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం



ఎడ్ల బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ మండలం కోడూరుపాడులో గ్రామదేవత ఊళ్లమ్మ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలను శనివారం నిర్వహించారు. తొలుత విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బండ లాగుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి సమయంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఒంగోలు జాతి ఎడ్లు పోటీల్లో పాల్గొనగా, వైఎస్సార్ జిల్లా ఎడ్లు సత్తా చాటి అన్ని బహుమతులు గెలుచుకున్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన కేశవ్ ఎడ్లు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, పెండ్లిమర్రి మండలం పాతసన్నింటిపల్లికి చెందిన కర్నాటి విశ్వనాథ్‌రెడ్డి ఎడ్లు ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన భావన ఎడ్లు తృతీయ బహుమతిగా రూ.30 వేలు, ఓబులమ్మపల్లికి చెందిన సామపు సతీష్‌రెడ్డి ఎడ్లు నాలుగో బహుమతిగా రూ.25 వేలు, నాగయ్యపల్లికి చెందిన వేమారెడ్డి ఎడ్లు ఐదో బహుమతిగా రూ.20 వేలను గెలుచుకున్నాయి. పట్టూరు ఖాజీపేటకు చెందిన ఎడ్లు ఆరో బహుమతిగా రూ.15 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన పాతకోట తేజస్విరెడ్డి ఎడ్లు ఏడో బహుమతిగా రూ.10 వేలను దక్కించుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నెల్లూరు ఆర్డీఓ మలోల కోరారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకొని మంచి నాయకులను ఎన్నుకున్నప్పుడే దేశం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ల్యాండ్ రెవెన్యూ ఆఫీసర్ శైలకుమారి, డీటీ బాలకోటమ్మ ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు రాంబాబు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

పొదలకూరు: పర్యావరణ హితం కోసమే ఆయా ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నామని డీఆర్వో లవన్న పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా మడకలవారిపల్లి నుంచి మనుబోలు మండలం గురివిందపూడి వరకు నాలుగు వరుసల హైవే నిర్మాణానికి సంబంధించి ఈ ప్రాంతంలో భూములను సేకరించారు. ఈ క్రమంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజల నుంచి అభిప్రాయాలను పొల్యూషన్ బోర్డు ఈఈ రాజశేఖర్, డీఆర్వో సేకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో ముందస్తుగా సమాచారాన్ని తెలియజేసి వేదికను ఏర్పాటు చేస్తామన్నారు.

భూములకు సరైన పరిహారం అందలేదు

తాము అందజేసిన భూములకు సరైన పరిహారాన్ని అందించలేదని మొగళ్లూరు, బిరదవోలు, లింగంపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు. మార్కెట్ విలువ ప్రకారం భూములకు విలువగట్టి నష్టపరిహారాన్ని అందించలేదని పేర్కొన్నారు. సోమశిల – పొదలకూరు రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా మార్చి గురివిందపూడి వరకు కలిపితే అందరికీ ఉపయోగంగా ఉండేదని కొందరు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మహిళకు గాయాలు

మనుబోలు: లారీ ఢీకొనడంతో టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందగా, వెనుక కూర్చున్న మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై పోర్టు క్రాస్‌రోడ్డు వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరివారిపాళేనికి చెందిన కురుగొండ రామయ్య (45) మనుబోలు మండలం వడ్లపూడిలో పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. వరినాట్లు వేసేందుకు గానూ తన గ్రామం నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై వడ్లపూడి బయల్దేరారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శ్యామల నెల్లూరు వెళ్లేందుకు టీవీఎస్ ఎక్సెల్ ఎక్కారు. పోర్టు క్రాస్‌రోడ్డు వద్ద నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే రామయ్య మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన శ్యామలను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

చెరువులో మృతదేహం లభ్యం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని లేక్‌వ్యూకాలనీ వద్ద నెల్లూరు చెరువు పొదల్లో వృద్ధుడి మృతదేహం చిక్కుకొని ఉండటాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారాన్ని శనివారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్సై రమేష్‌బాబు స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతదేహం ఉబ్బి గుర్తుపట్టలేని విధంగా తయారైంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ క్రమంలో కపాడిపాళేనికి చెందిన ఓ మహిళ బారాషహీద్ దర్గా వద్ద ఉంటున్న తన తండ్రి మూడు రోజులుగా కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను మార్చురీకి తీసుకెళ్లి వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు చూపించారు. మృతుడు తన తండ్రి అల్లాబక్షు (60) అని ఆమె తెలిపారు.

నాలుగేళ్లుగా దర్గాలోనే..

మృతుడిది కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు. ఆయనకు భార్య, పిల్లలున్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో వారి నుంచి విడిపోయి నాలుగేళ్లుగా బారాషహీద్ దర్గాలోనే ఉంటున్నారు. ప్రమాదవశాత్తూ నీటిలో పడ్డారో.. లేదా ఇతర కారణమో తెలియరాలేదు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి బీజేపీ మండలాధ్యక్షుడి మృతి



మనుబోలు: బైక్ అదుపుతప్పడంతో బీజేపీ మండలాధ్యక్షుడు మృతి చెందిన ఘటన మనుబోలు – పొదలకూరు మార్గంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. ఇటీవల అయ్యప్పమాల వేసిన ఓడూరు శ్రీనివాసులురెడ్డి (43) జనవరి ఒకటిన స్నేహితులతో కలిసి శబరిమల వెళ్లి శనివారం ఉదయమే తిరిగొచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని మిటాత్మకూరులో ఉన్న తన సోదరికి ఇచ్చి తిరిగి బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో మడమనూరు సమీపంలో రోడ్డుపై గుంట వద్ద బైక్ అదుపుతప్పింది. ఘటనలో రోడ్డుకు బలంగా గుద్దుకొని తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. శ్రీనివాసులురెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:90
లేయర్ (లైవ్)	:85
బ్రాయిలర్ చికెన్	:170
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:190
లేయర్ చికెన్	:145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.22
పండ్లు : రూ.7